క్లుప్తంగా


మహానందిలో భక్తజన సందడి



కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సాధారణ, శీఘ్ర, అతి శీఘ్ర దర్శ నం క్యూలైన్ల ద్వారా కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు



సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

పంట నమోదు తప్పనిసరి



వరి నారును పరిశీలిస్తున్న ఏఓ స్వాతి

బండిఆత్మకూరు: పంట నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి రైతులకు సూచించారు. మండల పరిధిలోని సింగవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. రబీలో సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ సిబ్బందితో నమోదు చేయించుకోవాలన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి

వెలుగోడు: బీజేపీ మండల అధ్యక్షుడిగా పోతుల రాజశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఎన్నికల అధికారులుగా అంతి రెడ్డి, అరవింద్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పోతుల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తన మీద ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించాన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఈనెల 5న జరిగే హైందవ శంఖారావానికి అన్ని గ్రామాల నుంచి హిందూ సోదరులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు వడ్ల ప్రతాప్ ఆచారి, నూలు నాగేశ్వర రావు, పురుషోత్తం గౌడ్, శ్రీనువాసులు, వెంకటసుబ్బయ్య, పవన్, మహేష్, తిరుపతయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ చిన్నసుబ్బయ్య



కామ్రేడ్ చిన్న సుబ్బయ్య వర్ధంతిని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ చిన్నసుబ్బయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో కామ్రేడ్ చిన్నసుబ్బయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నందికొట్కూరు, ఆత్మకూరు తాలూకాల్లో పార్టీ నిర్మాణానికి చిన్నసుబ్బయ్య ఎంతో కృషి చేశారని కొనియాడారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహానాయక్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి సుధాకర్, ఎ.సురేంద్ర, డి.రామ్ నాయక్, షేక్ ఇస్మాయిల్, భాస్కర్, జి.నాగేశ్వరరావు, ఎస్.స్వాములు, మారెన్న, వీరన్న, వెంకటేశ్వర్లు, బిఎస్ వలీ, మహమ్మద్, రఫీ, మహమ్మద్, సుబ్బయ్య, గణపతి పాల్గొన్నారు.

'నా గుండె సవ్వడి' పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన సాహితీవేత్త కవి కొప్పుల ప్రసాద్ రచించిన నాగుండె సవ్వడి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో తాజ్‌మహల్ హోటల్‌లో పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి పుస్తక సమీక్ష చేస్తూ ప్రసాద్ కవిత్వంలో ఆనందం, విషాదం రెండు సమపాళ్లలో కనిపిస్తాయని, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీని వారిని తన కవితల్లో తలపింపజేస్తారని, ప్రతి కవితలోను భాష, భావం, శిల్పం సమంగా ఉండేలా చూస్తారని కొనియాడారు. కళారత్న బిక్కి కృష్ణ, గజ్జల్‌క్విన్ పాల్గొన్నారు.

విభూతి ధారణతో మల్లన్న దర్శనం

- ఆలయంలోకి ప్రవేశించే భక్తులకు విభూతిధారణ
- పలు చోట్ల ఏర్పాటు.. పరవశిస్తున్న భక్తులు

నుదుట బొట్టు పెట్టుకోవడం సనాతన సంప్రదాయం. ఎంతో విశిష్టమైన మన సంస్కృతికి ఇది ప్రతీక. బొట్టు పెట్టుకున్న ముఖంలో మంగళకరమైన కళ తాండవిస్తుంది. విభూతి ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుంది. సర్వతీర్థాలలో స్నానం చేస్తే ఎంత ఫలమో, సర్వక్షేత్రాలను దర్శిస్తే ఎంత ఫలమో.. అంత ఫలము ఒక్క భస్మధారణతో లభిస్తుంది. అందుకే శ్రీశైల దేవస్థానం విభూతిధారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆలయంలోకి ప్రవేశించే ప్రతి భక్తుడూ విభూతి ధారణ చేసేలాఏర్పాట్లు చేసింది. – శ్రీశైలంటెంపుల్

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేసే భక్తులు తప్పనిసరిగా విభూతి ధారణ చేయాలనే ఉద్దేశంతో 2019 సెప్టెంబర్ 13న విభూతిధారణను ప్రవేశపెట్టింది. ఆలయంలోకి ప్రవేశించే వారంతా నుదుట విభూతి ధరించే వీలుగా పలుచోట్ల ఆయా ఏర్పాట్లు చేశారు. ఆలయ క్యూకాంప్లెక్స్, ఆలయ రాజగోపురం, ఉచిత దర్శన క్యూలైన్, శీఘ్రదర్శన క్యూలైన్ వద్ద విభూతి ధరించేందుకు వీలు కల్పించారు. దేవస్థానం ప్రవేశపెట్టిన విభూతి ధారణకు భక్తులు ఎంతో పరవశించిపోతున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్లే ముందు నుదుటిపై విభూతిధారణ చేస్తారు. దీంతో ఎంతో ఆధ్యాత్మిక చింతన పొందుతూ ఆలయంలో ఉన్నంతసేపు ఆధ్యాత్మిక అంశాలతో స్వామిఅమ్మవార్లను దర్శించి తరిస్తున్నారు.


– శిరస్సుపై విభూతి ధరిస్తే స్వయంగా బ్రహ్మ ప్రీతి చెందుతాడు. నుదుటిపై విభూతి ధరిస్తే స్కంధుడు ప్రీతి చెందుతాడు. కంఠంపై విభూతి ధరిస్తే వినాయకుడు, భుజాలపై విభూతి ధరిస్తే విష్ణువు, హృదయంపై విభూతి ధరిస్తే ఈశ్వరుడు, నాభిపై విభూతి ధరిస్తే భూదేవి, వీపుపై విభూతి ధరిస్తే పితరులు అలా ఆయా చోట్ల విభూతి ధరిస్తే ఆయా దేవతలు అనుగ్రహిస్తారు.



విభూతిధారణ చేస్తున్న భక్తురాలు

విభూతి ఓంకార స్వరూపం

విభూతిని ఎడమచేతిలో ఉంచుకుని కుడిచేతితో అభిమంత్రించాలి. కుడిచేతి మధ్యవేలితో నీటిని పోసి మిగిలిన వేళ్లతో భస్మాన్ని కలపాలి. అస్త్రమంత్రంతో అభిమంత్రించి, తల, నుదుట, హృదయం మొదలైన చోట్ల క్రమంగా భస్మాన్ని ధరించాలి. విభూతి ధరించే మూడు వేళ్లను మూడు అక్షరాలకు ప్రతినిధులు. ఉంగరపు వేలు ఆకారం, మధ్యవేలిలో ఉకారం, చూపుడు వేలులో మకారం ఉంటాయి. ఈ మూడు వేళ్లతో ధరించే విభూతి ఓంకార స్వరూపమని స్కాందపురాణం తెలిపింది.



శ్రీశైల ఆలయం

విభూతి రేఖలు ఆదిదేవతలు

విభూతిని మనం మూడు రేఖలుగా అవి విడివిడిగా కనిపించేలా ధరించాలి. విభూతి రేఖలు మూడింటిలో కిందిరేఖకు బ్రహ్మ, మధ్యరేఖకు విష్ణువు, పై రేఖకు మహేశ్వరుడు ఆధిదేవతలు. ఈ మూడు రేఖలు సృష్టి, స్థితి, సంహారాలకు ప్రతిరూపాలు. ఈ మూడు రేఖలకు మధ్యలోని రెండు ఖాళీ ప్రదేశాలలో ఒకదానికి షణ్ముఖుడు, రెండవ దానికి గణపతి ఆదిదేవతలు. ఇంతటి విశిష్టమైన విభూతిని ధరించి శివానుగ్రహం పొందాలని భక్తులు పరితపిస్తుంటారు.

నేడు కబడ్డీ పోటీలు

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్‌సీఎం చర్చి సంఘం పెద్దలు బుధవారం తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు చొప్పున అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు రూ.300 ప్రవేశ రుసుము చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 95153 25161, 89780 36038 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సీపీఎం నాయకురాలి మృతి

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో సీపీఎం నాయకురాలు సుబ్బరత్నమ్మ (52) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావును ఓదార్చి ధైర్యం చెప్పారు. సీపీఎం జిల్లా నాయకులు రాజశేఖర్, రామేశ్వరరావు, ఏసురత్నం, స్వామన్న, రణధీర్ నరసింహానాయక్ తదితరులు నివాళులర్పించారు.

ఊరువాడ నూతన సంబరాలు

- అభిమాన నేతలకు శుభాకాంక్షల వెల్లువ

నూతన సంవత్సర సంబరాలను నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 2024కు బైబై చెబుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలికిన యువత ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఇంటిల్లిపాది ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తమ అభిమాన నాయకుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. – ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణ వాసులు నూతన సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తహసీల్దార్, ఆర్డీఓ, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులు న్యూ ఇయర్ వేడులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ స్వగృహంలో కమిషనర్ రమేష్‌బాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్, వార్డు కౌన్సిలర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, నరసింహానాయక్, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొని నూతన శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చా నాయకురాలు మోమిన్ షభానా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ఇంట్లో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



కేకు కట్ చేస్తున్న సీపీఎం నాయకులు



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ మహిళలు

వెలుగోడులో..

వెలుగోడు: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకులు కట్ చేసి స్వీట్లు తినిపించుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



వెలుగోడు: పొట్టి శ్రీరాములు సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న యువకులు

ప్రత్యేక ప్రార్థనలు

శ్రీశైలంప్రాజెక్ట్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ కిరణ్ కుమార్ దైవసందేశాన్ని వినిపించారు. ఎవరైతే పాపాల పట్ల పాశ్చాత్తాపం పొంది, సంపూర్ణుడిగా దేవునికి అర్పించుకుంటారో అలాంటివారు పరలోక రాజ్యం పొందుతారన్నారు. ఇతరుల పట్ల ప్రేమ, దయ, క్షమ గుణాన్ని కలిగి ఉండాలన్నారు. సంఘ పెద్దలు వి.మేరి లలితమ్మ, జి.ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



పాములపాడు: చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో భక్తులు



నందికొట్కూరు: సీఎస్‌ఐ టౌన్ చర్చిలో దైవవాక్యం బోధిస్తున్న రెవరెండ్ ఫాదర్ శ్యామల్ రత్నరాజ్



నందికొట్కూరు: సీఎస్‌ఐ టౌన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాములపాడు: సహపంక్తి భోజనాలు చేస్తున్న భక్తులు

పాములపాడు: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు వేడుకలు నిర్వహించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత కేకులు కట్ చేసి, స్వీట్లు తినిపించుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం చిన్నారులు గ్రీటింగ్ కార్డులను ఒకరికొకరు ఇచ్చుకుంటూ, చాక్లెట్లు పంచుకుంటూ వేడుకలా నూతన సంవత్సరం తొలిరోజును జరుపుకున్నారు. పెద్దలు కరచాలనం చేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. స్థానిక జెరూషలేం ప్రార్థనా శాలలో బ్రదర్ సమ్సోన్ ఎఫ్రా నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలని, దేవుని మనస్సులో స్థానం నిలుపుకోవాలని చెప్పారు. అనంతరం చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు.

నందికొట్కూరు: నూతన సంవత్సరంలో ఏసుప్రభు ఆశీస్సులతో అందరూ బాగుండాలని సీఎస్‌ఐ టౌన్ చర్చి రెవరెండ్ ఫాదర్ శ్యామల్ రత్నరాజ్ అన్నారు. బుధవారం పట్టణ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అంగరంగ వైభవంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే క్రైస్తవులు నూతన దుస్తులు ధరించి పరిశుద్ధ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ మాట్లాడుతూ.. చెడు అలవాట్లను వదిలి నూతన సంవత్సరంలో మంచి మార్గంలో నడవాలన్నారు. మండల, పట్టణ, ప్రాంతాల్లోని సీఎస్ఐ, ఏబీఎం, ఆర్‌సీఎం హోసన్న, తదతర ప్రార్థన మందిరాల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యూ ఇయర్ వేడుకల్లో రెవరెండ్ గాంధీ, సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి బందెల జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్రబాబు, సిస్టర్ రుక్మినమ్మ, ఆర్‌సీఎం చర్చి సంఘం పెద్దలు, ఏబీఎం చర్చిలో సంఘం పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం న్యూ ఇయర్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచే యువతి,యువకులు కేక్‌లు కట్ చేసుకొని హ్యాపీ న్యూ ఇయర్ ఇంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కులం, మతం, వర్గబేధాలు లేకుండా అందరూ వేడుకలను జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు, మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పగిడ్యాల: మండలంలో 2024 సంవత్సరం పాత జ్ఞాపకాలను చెరిపి వేస్తూ 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్రైస్తవులు ప్రార్థనా మందిరాలకు చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు కరచాలనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, భాస్కరాపురం, తరిగోపుల, పి.లింగాపురం, పోతులపాడు గ్రామాల్లోని ప్రజలు ఆనందోత్సవాల మధ్య నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఉపాధి అవకాశాలపై యువత దృష్టి సారించాలి

శిరివెళ్ల: యువత స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. బుధవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతో పాటు విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. చదువు అయిన తర్వాత ఉద్యోగాలు దొరకనప్పుడు ఉపాధి కోసం కళాశాలలోనే శిక్షణ పొందాలన్నారు. దాతల సహకారంతో కుట్టు మిషన్లు విరాళంగా అందాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం దాతలు బొగ్గరప్పు నరసింహయ్య, సుబ్రహ్మణ్యం, జమాలయ్యను అధ్యాపకులు సన్మానించారు.

కబడ్డీ.. కబడ్డీ !

ఆంగ్ల సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకొని మండలంలోని భాస్కరాపురం గ్రామ ఏబీఎం చర్చి సంఘం అధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 36 జట్ల కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ పోటీలను ప్రారంభించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు క్రీడాకారులు పోటీల్లో తలపడగా ఫలితాలు గురువారం వెలువడే అవకాశాలున్నాయని ఏబీఎం సంఘపెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. – జూపాడుబంగ్లా



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఒకే ఊరు.. ఎన్నో పేర్లు!

- గ్రామం పేరు పోతులపాడు.. రికార్డుల్లో పి.ఘణపురం
- పగిడ్యాల మండలంలోని ఘణపురం గ్రామానికి వెళ్తున్న ఉత్తరాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- అన్ని రికార్డుల్లో ఒకే పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని వేడుకోలు



పోతులపాడు గ్రామ ఏరియల్ వ్యూ

జూపాడుబంగ్లా: గ్రామం పేరు ఒక్కో రికార్డులో ఒక విధంగా ఉండటంతో మండలంలోని పోతులపాడు గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పోస్టల్ డిపార్టుమెంట్ల రికార్డుల్లో పోతులపాడు గ్రామ పంచాయతీ పేరు పి.ఘణపురంగా నమోదు చేయబడింది. 1980కి పూర్వం పి.ఘణపురం గ్రామం పగిడ్యాల మండల రెవెన్యూ పరిధిలో ఉండేది. 1981లో శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో పి.ఘణపురం గ్రామం ముంపునకు గురి కావటంతో ఆ గ్రామస్తులు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరుకు సమీపంలో పోతులపాడు గ్రామం పేరిట స్థిరపడ్డారు. 43 ఏళ్లు గడిచినా ఇప్పటికీ పి.ఘణపురం పేరును అధికారులు రెవెన్యూ, మండల పరిషత్, తపాలాశాఖ రికార్డుల్లో అలాగే కొనసాగిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పోతులపాడు గ్రామానికి వచ్చే ఉత్తరాలు, ఇంటర్వ్యూ లెటర్లు పగిడ్యాల మండలంలోని ఎస్.ఘణపురం, ఎం.ఘణపురం గ్రామాలకు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిరుద్యోగులకు, గ్రామస్తులకు చేరాల్సిన సమాచారం సకాలంలో చేరకపోవటంతో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో రికార్డులో ఒక్కో పేరు

నీటిపారుదలశాఖ రికార్డుల్లో పోతులపాడు గ్రామం పేరు పోతిరెడ్డిపాడుగా నమోదు చేయగా, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ, తపాలా శాఖ రికార్డుల్లో పి.ఘణపురం గ్రామంగా నమోదు చేయబడింది.

పంచాయతీ భవనం మంజూరులో సమస్యలు

పంచాయతీరాజ్ శాఖలో పోతులపాడు గ్రామం పేరు పి.ఘణపురం అని నమోదు కావడంతో 2010–11లో గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం మంజూరైంది. అయితే కంప్యూటర్‌లో పి.ఘణపురం పేరిట భవనం మంజూరు కావటంతో పోతులపాడు గ్రామానికి సచివాలయం భవనం మంజూరు కాలేదని అధికారులు పేర్కొన్నారు. దీంతో పోతులపాడు గ్రామానికి మంజూరైన పంచాయతీ భవనం రద్దయ్యింది. తర్వాత అప్పటి సర్పంచ్ రవికుమార్ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో గ్రామానికి గ్రామసచివాలయం భవనాన్ని నిర్మింపజేశారు. అయినా ఇప్పటికీ పంచాయతీరాజ్‌శాఖ రికార్డుల్లో పోతులపాడు గ్రామం పేరు పి.ఘణపురం పేరుతోనే కొనసాగుతుండడం గమనార్హం.


పోతులపాడు గ్రామంగా నమోదు చేయాలి



గ్రామ పంచాయతీ పేరును రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ, పోస్టల్ డిపార్టుమెంట్లతో పాటు అన్ని శాఖల రికార్డుల్లో ఒకే విధంగా ఉండేలా పోతులపాడు అని నమోదు చేయాలి. 43 ఏళ్ల క్రితం రికార్డుల్లో ఉన్న పి.ఘణపురం పేరును అలాగే కొనసాగించటం వల్ల పంచాయతీ అధికారులతో పాటు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని గతంలో అనేక మార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం అయినా ఇప్పటివరకు మా గ్రామం పేరును మార్చకపోవటం సమంజసంగా లేదు. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మా గ్రామం పేరును అన్ని శాఖల రికార్డుల్లో పోతులపాడు గ్రామంగా నమోదు చేయించాలి.

– పల్లె నిర్మలమ్మ, సర్పంచ్, పోతులపాడు గ్రామం

యాగంటిలో భక్తుల సందడి



మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి నూతన సంవత్సరం ప్రారంభ రోజున భక్తులు, పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏకశిలా రూపంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి, రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు, వేంకటేశ్వరస్వామి గుహ, వీరబ్రహ్మేంద్ర స్వామి గుహ, శంకర గుహలను సందర్శించి పూజలు చేశారు.

– బనగానపల్లె రూరల్

ముమ్మరంగా వరికోతలు



మిషన్‌తో వరి కోత పనులు చేపడుతున్న దృశ్యం

నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పగిడ్యాల, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలతో పంట నూర్పిడి చేసుకొనేందుకు సమయభావంతో పాటు ఎకరానికి రూ.13 వేలు ఖర్చవుతుండటంతో పాటు ధాన్యం చేతికందేలోగా రెండు, మూడు రోజులు అవుతుంది. దీంతో రైతులు ఎకరాకు కేవలం రూ.3,500 ఖర్చుతో గంటలోగా ధాన్యం చేతికందుతుండటంతో పంటకోత మిషన్లతో నూర్పిళ్లు చేయించుకుంటున్నారు. జూపాడుబంగ్లా మండలంలో 6,500 ఎకరాలు, పాములపాడులో 6,354 ఎకరాలు, పగిడ్యాల మండలంలో 4,532 ఎకరాలు, కొత్తపల్లి మండలంలో 3,425 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుచేయగా ఇప్పటికే 80 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. పంటనూర్పిడి పూర్తైన వెంటనే రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న, కంది, మినుము వంటి పంటలు సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పంటలు చేతికందాలంటే కేసీ కాల్వకు మార్చి నెలాఖరు వరకు తప్పనిసరిగా సాగునీరు మంజూరు చేస్తేనే పంటలు చేతికందుతాయని రైతులు పేర్కొంటున్నారు. – జూపాడుబంగ్లా